క్లుప్తంగా

రేపు లివర్ సమస్యలపై ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: లివర్ పనితీరును తెలుసుకునేందుకు అవసరమైన స్కాన్ పరీక్షను ఉచితంగా చేస్తున్నామని కేర్ వెల్ హాస్పిటల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ షేక్ నాగూర్ బాషా తెలిపారు. స్థానిక గుంటూరువారితోట 7వ లైనులోని ఆస్పత్రిలో ఈనెల 15న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే వైద్య శిబిరాన్ని లివర్ సంబంధిత సమస్యలతో బాధపడేవారు వినియోగించుకోవాలని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ గౌస్‌బాషా కోరారు. 8341713713, 98847 57999 నంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలనిని ఆయన సూచించారు.

బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన

గుంటూరు ఎడ్యుకేషన్: కొరిటెపాడులోని ఎస్ఆర్ఎంవో హైస్కూల్లో గురువారం 8,9,10 తరగతుల విద్యార్థినులకు బాల్య వివాహ నిషేధ చట్టం-2006తో పాటు ఏపీ బాల్య వివాహ నిషేధ నియమాలు-2023పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగ న్యాయ, పర్యవేక్షణాధికారి బి. వాసంతి బాలల హక్కులకు సంబంధించిన చట్టాలు, ప్రాథమిక హక్కులపై మాట్లాడారు. సామాజికవేత్త రషీద్ 1098 చైల్డ్ లైన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం లలిత పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలి



గరికపాడు(కాకుమాను): నాడు-నేడు పనుల్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఎంఈవో కెఎఫ్.కెనడీ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని గరికపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనుల్ని గురువారం ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు-నేడు ద్వారా విద్యార్థులకు కావాల్సిన అన్ని వసతుల్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు శాకంబరీదేవిగా అమ్మవారు



పెదకాకాని: శ్రీ భ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఏసీ ఎన్. శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు. భక్తులు సమర్పించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలతో అమ్మవారితో పాటు ఆలయాన్ని నయనానందకరంగా అలంకరించినట్లు చెప్పారు. శాకంబరీదేవి అలంకరణలో శ్రీ భ్రమరాంబ అమ్మవారు శుక్రవారం నుంచి ఆదివారం వరకూ దర్శనమిస్తారని వారు పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

గుంటూరు రూరల్: అంకిరెడ్డిపాలెం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి సహకారంతో బాలికల కళాశాలకు ఉచితంగా పుస్తకాలు, వాహన సౌకర్యాలు, యూనిఫాం, ఫీజులు లేకుండా విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులంతా సౌకర్యాల్ని సద్వినియోగించుకుని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ ఆచారి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జీఎస్ఆర్ స్కూల్ డైరెక్టర్ జి. శివారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, కుర్రి సాంబిరెడ్డి, కుర్రి పుల్లారెడ్డి, మున్నంగి సంజీవరెడ్డి, దేవగిరి గంగాధరరెడ్డి, వజ్రాల వెంకటేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సిండికేటుగా డ్వాక్రాలో దోపిడీ

- ఐపీడీ కాలనీలో పేదల్ని లక్ష్యంగా చేసుకుని డ్వాక్రా గ్రూపుల ఏర్పాటు
- ఏర్పాటు చేసినందుకు రూ.10వేలు కమీషన్
- లక్ష రూపాయలు ఇప్పిస్తే రూ.23వేలు సమర్పించాలి
- అరండల్‌పేట ఐవోబీ బ్యాంకులో వందల సంఖ్యలో ఫేక్ గ్రూపులు

నెహ్రూనగర్: ఐపీడీ కాలనీ(ఇందిరా ప్రియదర్శిని)కి చెందిన శ్రావణి గ్రూపు సభ్యుల నుంచి డ్వాక్రా రుణం తానే చెల్లిస్తానని చెప్పి ప్రతి మహిళ దగ్గర రూ.70వేలు చొప్పున పది మంది నుంచి రూ.7లక్షలు తీసుకుని, ఆ తరువాత బ్యాంకుకు రుణం చెల్లించకుండా ఎగవేసిన ఘటన మరువకముందే, సదరు ప్రాంతం నుంచే మరొక మోసం బయట పడింది. పేదల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని దోచుకుంటున్న వైనం వెలుగులోకి వచ్చింది. ఆ ప్రాంత ఆర్పీ కొంత మంది ప్రైవేటు వ్యక్తుతో డ్వాక్రా గ్రూపులు ఏర్పాటు చేసి, వారి నుంచి భారీగా కమీషన్లు తీసుకుంటుందనే తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్న మెప్మా సిబ్బంది

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం డ్వాక్రా గ్రూపుల ద్వారా రుణం మంజూరు చేసి దోహదపడుతుంటే...దానికి మెప్మా సిబ్బంది తూట్లు పొడుస్తున్నారనే చెప్పుకోవాలి. ఐపీడీ కాలనీకి చెందిన ఓ ఆర్పీ(రిసోర్స్ పర్సన్) తనకింద కొంత మంది ప్రైవేటు వ్యక్తుల్ని అనధికారకంగా పెట్టుకుంది. వారి ద్వారా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారిని గ్రూపులుగా ఏర్పాటు చేసి లోన్లు ఇప్పిస్తోంది. 10 మందితో గ్రూపు ఏర్పాటు చేసిన వ్యక్తికి రూ.10వేలు కమిషన్ ఇచ్చేలా ఒప్పందాలు జరుగుతున్నాయని సమాచారం. గ్రూపునకు రూ.10లక్షలు మంజూరైతే రూ.23వేలు కమీషన్ ఆర్పీకి ఇవ్వాల్సిందేనని ముందుగానే చెప్పి రుణం మంజూరు చేయించుకుంటారు. వారు లోన్ కడతారా.. లేదా? అని ఆలోచించకుండా మంజూరు చే యించి కమీషన్ తీసుకుంటారు. తీరా గ్రూపు సభ్యులు డబ్బులు చెల్లించకపోతే ఏర్పాటు చేసిన సదరు వ్యక్తి దగ్గరికి ఆర్పీ, ఆమె భర్త, ప్రైవేట్ వ్యక్తులు ఫోన్లు చేసి బెదిరింపులకు దిగడం పరిపాటిగా మారింది.

అక్రమాలకు బ్యాంక్ సిబ్బంది సహకారం ?

డ్వాక్రా గ్రూపు ఏదైనా కొత్తగా క్రియేట్ అయితే సదరు గ్రూపునకు రూ.30వేలు మాత్రమే ఇస్తారు. కాని తూర్పు నియోజకర్గంలోని ఆర్పీలు అమాయక ప్రజల్ని టార్గెట్ చేసుకుని వారి పూర్తి వివరాలతో వేరొక బ్యాంకులో పాత గ్రూపు పేరు మీద క్రియేట్ చేయిస్తున్నారు. బ్యాంకు సిబ్బంది సహకారంతో పది మంది గ్రూపు సభ్యులకు రూ.10లక్షలు మంజూరు చేయిస్తున్నార. ఈ విధంగా అరండల్‌పేట ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో వందల సంఖ్యలో ఫేక్ గ్రూపులు ఉన్నాయని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి.

గ్రూపు చేయించినందుకు డబ్బులు కట్టమంటున్నారు



నేను ఐపీడీ కాలనీలో టైలరింగ్ చేసుకుంటూ జీవిస్తుంటా. కొంతమంది వ్యక్తులు నా దగ్గరకు వచ్చి డ్వాక్రా గ్రూపులు చేయిస్తే కమీషన్ ఇస్తామని చెప్పారు. నేను రెండు గ్రూపులు చేయించాను. లక్షకు రూ.23వేల కమీషన్‌ను ప్రైవేటు వ్యక్తుల ద్వారా ఆర్పీకి అందజేశాను. తీరా గ్రూపు సభ్యులు రుణం తిరిగి చెల్లించకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు, ఆర్పీ, ఆమె భర్త ఫోన్లు చేయడంతో పాటు దుర్భాషలాడుతున్నారు. అధికారులు స్పందించి నాకు న్యాయం చేయాలి.

–డి. ఝాన్సీ మేరి, ఐపీడీ కాలనీ

జగనన్న సురక్ష అద్భుతం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముస్తఫా

ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు జగనన్న సురక్ష అద్భుతమైన కార్యక్రమమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా పేర్కొన్నారు. నియోజకవర్గంలోని 8, 10 డివిజన్లకు సంబంధించి పాత గుంటూరులోని కంకికొడవలి బొమ్మ సెంటర్ వద్ద గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అనేక సంక్షేమ పథకాల్ని చేరువ చేస్తున్నారని తెలిపారు. ఎటువంటి ధ్రువీకరణ పత్రం కావాల్సి వచ్చినా జగనన్న సురక్ష ద్వారా నేరుగా వలంటీర్లు ఇంటికి తీసుకెళ్లి అందజేసే పరిస్థితి ఏర్పర్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని కొనియాడారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ షజిల, మహిళ నేత షేక్ నూరి ఫాతిమా, కార్పొరేటర్లు ఇర్రి ధనలక్ష్మి, మీరావలి, సాయి, వైఎస్సార్ సీపీ నేతలు కిశోర్, ఫారూఖ్, పూర్ణ, సుభాని, జర్రుల్లా, రాజశేఖర్, ప్రదీప్, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సంక్షేమానికి రక్ష: మేయర్



ధ్రువపత్రాలు అందజేస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. నగరంలోని 31వ డివిజన్ ఏటీ అగ్రహారం 4వ లైన్‌లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆయన పాదయాత్రలో ఇచ్చిన హామీల్ని క్రమం తప్పకుండా అమలు చేస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాల్లో ధ్రువీకరణ పత్రాలు కావాలంటే ప్రభుత్వ కార్యాలయాలు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ప్రజల దగ్గరకే అధికారులు వెళ్లి పత్రాలు అందించి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నారని మేయర్ వివరించారు. సచివాలయ వ్యవస్థ దేశంలోనే అత్యుత్తమమైనదని, ఎన్నో రాష్ట్రాల ముఖ్యమంత్రులు వారి రాష్ట్రాల్లో కూడా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని మేయర్ చెప్పారు. అనంతరం పలువురికి ధ్రువపత్రాల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అందుగుల సంతోష్, పడాల సుబ్బారెడ్డి, డెప్యూటీ కమిషనర్ వెంకటకృష్ణయ్య, ఈఈ కొండారెడ్డి, సీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, నోడల్ అధికారులు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

నగరంలో శరవేగంగా అభివృద్ధి పనులు



పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్

నెహ్రూనగర్: నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలోని 20వ డివిజన్ పార్వతీపురంలో రూ. 45 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లో ఇప్పటికే రామనామక్షేత్రం ప్రధాన రహదారి విస్తరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని వార్డుల్లో అభివృద్ధి పనుల్ని కుల, మత, పార్టీలకతీతంగా ప్రాధాన్యతా క్రమంలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉన్న ప్రాంతాల్లో రహదారుల విస్తరణ చేస్తున్నట్లు తెలిపారు. తమ పాలకవర్గం ఏర్పడ్డాక నగరపాలక సంస్థ పరిధిలో రూ. 200 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారని, అంతేకాకుండా నగరాభివృద్ధికి కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని మేయర్ వివరించారు. నగరాభివృద్ధికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజా ప్రతినిధుల్ని కలుపుకొని వెళ్తామని, వారి అభిప్రాయాల మేరకు అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. కాంట్రాక్టర్లు కూడా పనుల్ని నిబంధనల ప్రకారం నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలని ఆయన చెప్పారు. అధికారులు కూడా నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని మేయర్ సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, వైఎస్సార్ సీపీ 20వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు కంతేటి శ్యాంశేఖర్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుపేట శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు

నగరంలోని శ్రీనివాసరావుపేట హిందూ శ్మశానవాటికను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రూ. 6 కోట్లతో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనుల్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలోని శ్మశానాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. శ్రీనివాసరావుతోటలోని వాటికను నగరంలోని ఎనిమిది డివిజన్లకు చెందిన సుమారు లక్ష మంది ప్రజలు వినియోగిస్తున్నారని తెలిపారు. వారి ఆకాంక్ష మేరకు శ్మశానవాటికలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కర్మకాండలు నిర్వహించడానికి బస్టాండ్ వద్ద గల సత్రాన్ని వినియోగిస్తున్నారన్నారు. ఇకనుంచి శ్మశానవాటికలోనే చేసుకోవడానికి వీలుగా సత్రాన్ని నిర్మిస్తున్నామని మేయర్ వెల్లడించారు. నగరంలో శ్మశానాల అభివృద్ధికి స్వచ్ఛంద సేవా సంస్థల సహాయ, సహకారాలు కూడా తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నిమ్మల వెంకటరమణ, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

నగర సమగ్రాభివృద్ధికి పాలకవర్గం ఎనలేని కృషి

స్టాండింగ్ కమిటీ సమావేశంలో మేయర్ కావటి



నెహ్రూనగర్: నగర సమగ్రాభివృద్దే ధ్యేయంగా పాలకవర్గం ఎనలేని కృషి చేస్తోందని స్టాండింగ్ కమిటీ చైర్మన్, నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు తెలిపారు. ఆయన ఛాంబర్‌లో గురువారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. నగరంలోని అన్ని డివిజన్ల ప్రజా ప్రతినిధులు ప్రతిపాదించిన అంచనాలు, అధికారులు ప్రతిపాదనలు చేసిన 215 అభివృద్ధి పనులపై స్టాండింగ్ కమిటీ సభ్యులు, నగరపాలక సంస్థ వివిధ విభాగాధిపతులతో విపులంగా చర్చించి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు నగరంలో గుర్తించిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణాలకు డివిజన్ల వారీగా ప్రాధాన్యతక్రమంలో ఆమోదం తెలిపినట్లు చెప్పారు. విలీన గ్రామాల్లో నూతనంగా సీసీ డ్రెయిన్లు, రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేక ఆమోదం తెలిపామని పేర్కొన్నారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు నిమ్మల వెంకటరమణ, పడాల సుబ్బారెడ్డి, బొద్దులపల్లి స్మిత పద్మజ, షేక్ జుమ్మాబి, మల్లవరపు రమ్య, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్లు బి. శ్రీనివాసరావు, టి. వెంకట కృష్ణయ్య, శ్రీనివాసరావు, ఎస్ఈ భాస్కర్, సీపీ ప్రదీప్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పీఎఫ్, ఈఎస్ఐ ప్రయోజనాల కోసం పోస్టుకార్డు ఉద్యమం



పోస్టు కార్డులను ప్రదర్శిస్తున్న గృహ కార్మికులతో వ్యాకుల మేరి, దుర్గ, లావణ్య తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అసంఘటిత రంగంలో గృహ కార్మికులుగా మగ్గుతున్న మహిళలకు పీఎఫ్, ఈఎస్ఐ ప్రయోజనాల్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ ప్రధానమంత్రికి పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం ఏపీ గృహ కార్మిక సమాఖ్య కార్యదర్శి సిస్టర్ వ్యాకుల మేరి ఆధ్వర్యంలో మల్లికార్జునపేటలోని సెయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రంలో సమావేశమైన గృహ కార్మిక మహిళలు అక్కడి నుంచి బ్రాడీపేటలోని హెడ్ పోస్టాఫీసు వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాకుల మేరి మాట్లాడుతూ గృహ కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ వర్తింప చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. తద్వారా గృహ కార్మికులుగా మగ్గుతున్న మహిళలకు సామాజిక భద్రత లభిస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని అందజేయడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా 100 మందికి పైగా మహిళలు పోస్టుకార్డులు రాసి ప్రధానమంత్రికి పంపారు. కార్యక్రమంలో సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు ఆర్. దుర్గ, కార్యదర్శి బి. లావణ్య, గృహ కార్మికులు పాల్గొన్నారు.

నేడు ఐపీఏ అమరావతి శాఖ ప్రారంభోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసిసోయేషన్ (ఐపీఏ) అమరావతి శాఖ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. నాగభూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముంబై ఐపీఏ అధ్యక్షుడు డాక్టర్ టి.వి.నారాయణ, ఐపీఏ ఎడ్యుకేషన్ డివిజన్ చైర్మన్ డాక్టర్ ఎస్. విద్యాధర ముఖ్య అతిథులుగా పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జీజీహెచ్‌కు కాఫీ మిషన్ బహూకరణ



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రికి గురువారం బసవపున్నయ్య జ్ఞాపకార్థం ఆయన తనయుడు కాఫీ మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రికి గతంలో కూడా మినరల్ వాటర్ కూలర్ అందచేశారని గుర్తు చేశారు. తండ్రి జ్ఞాపకార్థం తనయులు ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని తెలిపారు. సూపరింటెండెంట్ కార్యాలయానికి వచ్చే రోగుల సహాయకులకు కాఫీ, టీ ఇచ్చేందుకు మిషన్ ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

భారత రాజ్యాంగంపై అవగాహన కోసం సిబ్బందికి పరీక్ష

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌ను ఏసీఎఫ్ సంస్థ ప్రతినిధులు గురువారం మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. తమ సంస్థ భారత రాజ్యాంగంపై వైద్య విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించేందుకు సెప్టెంబరు 10న రాత పరీక్ష నిర్వహిస్తోందని తెలిపారు. పరీక్ష రాసేందుకు 15 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ అర్హులని పేర్కొన్నారు. మెరిట్ సాధించిన పది మందికి రాజ్యాంగ దినోత్సవం రోజు జరిగే సభలో బహుమతులు అందజేస్తామని వివరించారు. గుంటూరు జీజీహెచ్‌లో వైద్య విద్యార్థులు, సిబ్బంది పరీక్షకు దరఖాస్తు చేసేలా చూడాలని సంస్థ ప్రతినిధులు సూపరింటెండెంట్‌ను కోరారు. కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ కలెక్టర్ మురళి, రిటైర్డ్ డీఎస్పీ రవికుమార్, నల్లపాడు భాస్కర్, గాబ్రియేల్, జీజీహెచ్ సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్ సిబ్బందిపై దాడి

పట్నంబజారు: జీజీహెచ్ సిబ్బందిపై అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు కర్రతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 12వ తేదీ రాత్రి జీజీహెచ్‌లోని ప్రసూతి వార్డులో తాడికొండ మండలం ఉంగుటూరు గ్రామానికి చెందిన బుల్లా రవిబాబు పూటుగా మద్యం తాగి తిరుగుతూ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తున్న బి. రామలక్ష్మిని, స్టాఫ్ నర్సులను, సెక్యూరిటీ సూపర్‌వైజర్ గేరా బుజ్జిని దుర్భాషలాడటంతో పాటు కర్ర తీసుకుని వారిపై దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

పట్నంబజారు: ఆన్‌లైన్‌లో నగదు అపహరించిన సంఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొత్తూరివారితోటకు చెందిన ఠాగూర్ భవానీసింగ్ ఈ నెల 10న గూగుల్‌పే ఉపయోగించి ఫోన్ రీచార్జ్ చేసేందుకు ప్రయత్నించారు.

అది కాకపోవడంతో గూగుల్ కస్టమర్ కేర్ కోసం ఆన్‌లైన్‌లో వెతుకే ప్రయత్నం చేయగా, గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. ఎనీ డెస్క్ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోమని చెప్పాడు. భవానీసింగ్ నుంచి వివరాలు తెలుసుకుని, ఓటీపీ అడగ్గా ఆయన చెప్పారు. అనంతరం 11న భవానీసింగ్ అకౌంట్‌లోని రూ. 90వేల నగదు అపహరణకు గురవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

16న ఇంటర్ ప్రతిభావంతులకు మాస్టర్ మైండ్స్ ప్రతిభా పురస్కారాలు



మట్టుపల్లి మోహన్

గుంటూరు ఎడ్యుకేషన్: నగర పరిధిలోని వివిధ జూనియర్ కళాశాలల్లో జూనియర్ ఇంటర్ చదివి, ఏప్రిల్ 26న ప్రకటించిన ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఈనెల 16న ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ గురువారం తెలిపారు. స్టేట్ సిలబస్‌లో ఎంపీసీ గ్రూప్‌లో 450, బైపీసీ గ్రూప్‌లో 420, ఎంఈసీలో 470, సీఈసీలో 450కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం సాయంత్రం 5.00 గంటలకు బ్రాడీపేట 4/11లోని వజ్రం హోటల్ పక్కన ఉన్న మాస్టర్ మైండ్స్ బాలాజీ క్యాంపస్‌లో పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి హాజరు కాగోరు విద్యార్థులు ముందుగా పేర్లు నమోదు చేసుకుని, తల్లిదండ్రులతో పాటు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు తమ వెంట ఆధార్ కార్డు, ఇంటర్ మార్కుల జాబితా ఇంటర్నెట్ కాపీ తీసుకుని రావాలని సూచించారు. ప్రతిభా పురస్కారాల సర్టిఫికెట్‌తో పాటు జ్ఞాపిక, నగదు బహుమతి అందజేస్తామని మోహన్ తెలిపారు. పేర్లు నమోదుకు 8978180847, 9248722218 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి ఆర్థిక సాయం



నగరంపాలెం: గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు వైపునున్న దక్షిణ మధ్య రైల్వే ఆటో డ్రైవర్ యూనియన్‌లో సభ్యుడైన ఏసు ఈనెల 2న అనారోగ్యంతో మృతి చెందాడు. యూనియన్ తరఫున ఒక్కొక్క డ్రైవర్ నుంచి రూ.500 చొప్పున రూ.50 వేలు సేకరించి గురువారం రామిరెడ్డి తోటలోని ఏసు కుటుంబ సభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు హెచ్.సెబాస్టియన్, ఉపాధ్యక్షుడు వాసు, కార్యదర్శి జి.సుధీర్, కోశాధికారి ఆర్.నరసింహారావు, షేక్ రసూల్, ఎ.నాగేశ్వరరావు, ఎం.దేవా, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.